


రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## నానో యూరియాతో అధిక దిగుబడులు

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

నానోయూరియా వినియోగంతో అధికదిగుబడిని పొందవచ్చునని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. నానోయూరియా ను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారి చేయవచ్చు అనే విషయాన్ని రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటికీ జిల్లాలో నానోయూరియా 5431 లీటర్లు అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. ఎకరాకు అరలీటర్ (లీటర్ నీటికి నాలుగు మిల్లీలీటర్ల నానోయూరియా) చొప్పున మిశ్రమంచేసి పంటల్లో పిచికారి చేయాలని కలెక్టర్ తెలిపారు. నానోయూరియా ను ఉపయోగించడం ద్వారా రైతులు సంప్రదాయ యూరియా ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని ఆయన ఈసందర్భంగా చెప్పారు. నానోయూరియా వల్ల విలువైన వ్యవసాయ పద్ధతుల ను ప్రోత్సహించవచ్చని, అదేవిధంగా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుందని కలెక్టర్ తెలిపారు. నానో యూరియా అనేది ద్రవపదార్థ ఎరువులని, ఇది ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్నిట్యూట్ అభివృద్ధిచేసిన విప్లవాత్మక ఉత్పత్తి అని కలెక్టర్ ఈసందర్భంగా తెలిపారు.

## మేడ్చల్ మండలంలో భారీ వర్షాలు

**మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఇటీవల మేడ్చల్ మండలంలో కురిసిన భారీవర్షాలు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ అనూహ్యమైన వర్షపాతం కారణంగా వందలాది ఎకరాల్లో సాగుచేసిన పంటలు నీటమునిగి రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. అనేకప్రాంతాల్లో పొలాలు ఇంకా వరదనీటిలోనే ఉన్నందున, పంటనష్టం అంచనా మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈవర్షాలు వ్యవసాయరంగాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజా రవాణావ్యవస్థపైనా తీవ్రప్రభావం చూపాయి. మండలంలోని ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని బండ మాదారం గ్రామ క్వార్టర్స్ నుండి నూతనకల్ గ్రామానికి వెళ్లే దారి పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. ఈ రోడ్డుపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈదారి పూర్తిగా పాడైతే, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. స్థానికప్రజలు, ప్రభుత్వం, అధికారులు యుద్ధప్రాతిపదికన వెంటనే తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.

## కలెక్టరేట్‌లో ఉత్సాహంగా క్రీడాపోటీలు

-పోటీల్లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు



చెస్ క్రీడను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా యువజనక్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల ు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రారంభించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించి జెండా ఊపి క్రీడల ు ఆరంభించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులతోకలిసి తాడుతో టగ్గాఫ్ వార్ క్రీడల్లో స్వయంగా జిల్లా కలెక్టర్ పాల్గొని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు. తదనంతరం 100 మీటర్ల రన్నింగ్, క్యారమ్స్, చెస్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ ఆటల పోటీల్లో ఉద్యోగులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డివైఎస్‌ఓ సత్తార్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిటిడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డిడబ్ల్యూఓ కృష్ణవేణి, వ్యవసాయ అధికారి రాజారత్నం, ఆకార అధికారి నాగార్జున, ఆడిట్ అధికారి శ్రీనివాస్ బాబు, డిబిసిడబ్ల్యూఓ మాధవరెడ్డి, హౌసింగ్ ఇంచార్జ్ పిడి మొక్రంబాబా, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నైమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు అధికారులు ముందడుగు

-రాజకీయ నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్టాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వత తేదీ వరకు స్వీకరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ 2025, జూలై1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయతీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగిందని, వీటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 వరకు సరిచేసుకోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ బూత్‌ల జాబితాలో అభ్యంతరాలు వున్నా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 2న గ్రామపంచాయతీలలో వార్డుల వారిగా ఫోటోలతో కూడిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని తాండాలలో పోలింగ్‌బూత్‌లు దాదాపు 5కిలోమీటర్ల పరిధిలో వున్నాయని, కొత్తూరు తదితర ప్రాంతాలలో పరిశ్రమలలో పనిచేస్తున్న వారికి దగ్గరనే పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈసమావేశంలో డిపిఓ సురేష్‌మోహన్, జెడ్పి సిఈవో కృష్ణారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, బిఆర్‌ఎస్‌నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, నిట్టు జగదీశ్వర్, బిజెపి అధ్యక్షులు రాంభూపాల్‌గౌడ్, వి.మల్లారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, బి.సామ్యేల్, సిపిఐ నాయకులు పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, టిడిపినాయకులు జె.రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

## గడిమైసమ్మను దర్శించుకున్న సినీనిర్మాత దిల్ రాజు



మేడ్చల్‌లోని గడిమైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న సినీనిర్మాత దిల్ రాజు

**మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ప్రముఖ తెలుగు సినీనిర్మాత దిల్ రాజు గురువారం మేడ్చల్ పట్టణంలోని గడిమైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఎప్పటినుంచో ఈ ఆలయాన్ని సందర్శించాలని భావిస్తున్న దిల్‌రాజు, గురువారం ఉదయం మేడ్చల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న గడిమైసమ్మ దేవాలయానికి విచ్చేశారు. ఆలయపూజారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం దిల్‌రాజు గడిమైసమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీకౌన్సిలర్ మణికంఠగౌడ్, స్థానికులు శివకుమార్, జంగయ్య, మోనార్క్ పాల్గొన్నారు.

## చెరువులో నిమజ్జన ఏర్పాట్లు ఎసి పరిశీలన



ఎదులాబాద్ లక్ష్మీనారాయణచెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

వినాయక నిమజ్జన కార్యక్రమం సజావుగా నిర్వహించేలా అధికారులు పనిచేయాలని మేడ్చల్ జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువును శుక్రవారం ఆయన సందర్శించారు. వినాయక నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్‌తో కలిసి ఎసి చెరువువద్ద జరుగుతున్న ఏర్పాట్లనుచూసి నిర్వహణను అడిగితెలుసుకున్నారు. నిమజ్జనానికి ఇబ్బందులులేకుండా చూడాలని అధికారులకు సూచనలుచేశారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ డిఎస్. రజిని, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, గిర్దావర్ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు కృషి

-మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్
-శామీర్‌పేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పర్నిచర్, వాటర్‌ప్లాంట్ ప్రారంభం

**శామీర్‌పేట, ఆగస్టు 29, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో సిఎస్‌ఆర్ నిధులతో మౌలికసదుపాయాలు, సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం శామీర్‌పేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి సహకారంతో ఫర్నిచర్‌ను, ఆర్ఓ త్రాగునీరు వాటర్ ప్లాంట్‌లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువగా చదువుతున్నారని, అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేని పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని, ఇక గతంలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరటం కూడా పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు కూడా ఉన్నట్లు వీటిని పరిష్కరించటానికి సిఎస్‌ఆర్ నిధులతో సౌకర్యాలు కల్పించటం జరుగుతుందన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో, ఆరోగ్యకేంద్రాల్లో సిఎస్‌ఆర్ నిధులతో సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తానని అన్నారు. పాఠశాలలో ప్రారంభించిన త్రాగునీటి వాటర్‌ప్లాంట్‌ను, తరగతి గదులలో బెంచ్, డెస్క్‌లు, ఫర్నిచర్‌ను ఉపాధ్యాయులే యాజామాన్యాలుగా ఉంటూ కాపాడాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యతగల విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులు, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శామీర్‌పేట మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, స్థానిక స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేణు, మాజీ కౌన్సిలర్ డి.మల్లిఖార్జున్, శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, మాజీ అధ్యక్షులు కె.యాదగిరి, బిజెపి నాయకులు డి.పవన్‌గౌడ్, డి.మైసయ్య, మండల, గ్రామ పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు సహకరించాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు వారి వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కోరారు. శుక్రవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాలవారీ ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగిందని, వీటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 వరకు సరిచేసుకోవచ్చని అన్నారు. పోలింగ్‌బూత్‌ల జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 30న ఆయా మండలాల్లో ఎంపిడిఓలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో కూడా అభ్యంతరాలు తెలుపవచ్చని అన్నారు. దీని ఆధారంగా ఈ నెల 31న ఆయా అభ్యంతరాల ు జిల్లాలోని జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారని అన్నారు. ఈ నెల 2న గ్రామ పంచాయితీలలో వార్డుల వారిగా ఫోటోలతో కూడిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. జిల్లాలోని 594 గ్రామ పంచాయతీలలో 5058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6,98,478 ఓటర్లు నమోదు అయ్యారని, ఇందులో 343672 మంది పురుషులు, 354790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈసమావేశంలో డిపిఓ జయసుధ, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామాలలో కీటక జనిత డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణకై పారిశుధ్య చర్యలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలకు, వైద్యాధికారుకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో డెంగీ కేసులు ప్రబలే హాట్‌స్పాట్లను గుర్తించి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా నివారణకు వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, పంచా యతీ అధికారులు సమన్వయంతో విస్తృతంగా పారిశుధ్య చర్యలు, ఫాగింగ్, రెసిడ్యుయల్ స్ప్రే చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు చెత్త తొలగించాలని, ఒక వేళ శుభ్రం చేయకుంటే నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆశా వర్కర్లు ప్రతి రోజు 50 ఇళ్లను సందర్శించి జ్వర సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు వరకు ప్రతి ఇంటిని నాలుగుసార్లు సందర్శించాలన్నారు. మున్సిపాలిటీల్లో స్వచ్ఛ ఆటోలద్వారా, గ్రామాలలో పంచాయతీల కార్యదర్శులు ట్రాక్టర్ల ద్వారా ఆడియో క్లిప్ ప్లేచేసి కీటకజనిత వ్యాధుల నివారణ, పారిశుధ్యంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

ప్రతి శుక్రవారం డ్రైడే రోజున ఉదయం 10 గంటలకు ప్రతి ఇంటిని పరిశుభ్రం చేసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చెత్త, నీరు నిల్వకుండా చూసుకోవడంతో పాటు కూలర్లు, కొబ్బరిచిప్పలు, కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సి నారాయణరెడ్డి

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

-శామీర్‌పేట చెరువులో నీటిమట్టం పెరిగినందున బారికేడ్స్ ఏర్పాటు
-సందర్శించిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లాకలెక్టర్ మనుచౌదరి

**శామీర్‌పేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండటానికి సంబంధిత అధికారులు పకడ్బందీగా చెరువులో ఏర్పాట్లుచేయాలని మేడ్చల్‌జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట పెద్దచెరువు వద్ద వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను అడిషనల్ డిసిపి పురుషోత్తంతోకలిసి కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ శామీర్‌పేట పెద్దచెరువులో నీటిమట్టంపెరిగినందున చెరువులోనిర్వహించే వినాయకుల నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్స్ ఏర్పాట్లుచేయాలని, క్రేన్స్ పాయింట్స్‌వద్ద కూడా అప్రమత్తంగా ఉండి ఏర్పాట్లు చేయటం జరుగుతుందన్నారు. లైటింగ్, శానిటేషన్, వైద్య సదుపాయం, త్రాగునీరు, టాయిలెట్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు, ట్రాఫిక్ బందోబస్తు, మత్స్య, ఫైర్‌శాఖల వారు తమ కేటాయించిన విధులను నిర్వహించాలన్నారు. వినాయకనిమజ్జనం పూర్తయ్యేంతవరకు అధికారులు, సిబ్బంది 24గంటలపాటు విధులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెరువుప్రాంగణంలో పరిశుభ్రతకు మున్సిపాల్టీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయకనిమజ్జన ఏర్పాట్లను అధికారులు, సిబ్బంది దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు. ఆర్‌అండ్‌బి వారు నిర్మిస్తున్న రోడ్లు వినాయక వాహనాల రాకపోకులకు సరిపడే విధంగా నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో వారితోపాటు కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవాల మేడ్చల్ నియోజకవర్గ కోకన్వీనర్ ఎన్.రవీందర్‌గౌడ్, ఆర్‌అండ్‌బి అధికారి శ్రీనివాస్‌మూర్తి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మధుసూదన్, స్థానిక ఎస్‌ఐ శశివర్ధన్‌రెడ్డి, విద్యుత్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ఆమనగల్లు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఒకటి చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక ఎస్సై వెంకటేశ్ వెల్లడించారు. మండలపరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన దరువుల శేఖర్ ఆమనగల్లు పట్టణంలో ఒక చికెన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఇతను ఆగస్టు 28 అర్ధరాత్రి సుమారు 12గంటల సమయంలో టిఎస్07హెచ్8397పై బైక్‌పై మంగళపల్లిగ్రామానికి బయలుదేరారు. పట్టణంలోని జాతీయ రహదారిపైగల రాజీవ్‌చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ఇన్నోవా ఏపి05సిహెచ్9999 వాహనం అతివేగంగా ఢీకొట్టిందన్నారు. దీంతో తీవ్రగాయాలకు గురైన శేఖర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదుమేరకు కారుడ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వివరించారు.

## మర్రిపల్లిగూడలో వ్యక్తి అదృశ్యం

**ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఉద్యోగం వెతుక్కోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ మర్రిపల్లిగూడకు చెందిన బీట్కూరి శ్రీనివాస్ కుమారుడు శివ(31) ఈనెల 26నుంచి కనిపించకుండా పోయాడు. శివ భార్య రమ్య తన బాబు, పాపతో కలిసి ఈనెల 25న ఆమె వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటలకు రమ్య తన భర్త శివకు ఫోన్‌చేయగా స్విచ్ఛ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె వాళ్ల మరిదికి ఫోన్ చేసి శివ అన్న ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ వస్తుంది ఇంట్లో ఉన్నాడా చూడమని చెప్పింది. అన్న ఉదయం 11:30 గంటలకు ఉద్యోగం వెతుక్కోవడానికి వెళ్తున్నానని చెప్పి బయటకువెళ్లాడని చెప్పాడు. శివ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో రమ్య అతనికోసం బంధువులకు ఫోన్ చేసి భర్త ఆచూకీ కోసం ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. శివ అదృశ్యం కావడంతో రమ్య గురువారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. శివ బయటకు వెళ్లిన సమయంలో తెలుపురంగు చొక్కా, నీలంరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, 6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఈమేరకు వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

## గుర్తుతెలియని వృద్ధుడు మృతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

వర్షంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ పుడమి స్కూల్ సమీపంలో పశువులుమేసే భూమిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని గురువారం ఉదయం సమాచారంరావడంతో ఘట్‌కేసర్ పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి దాదాపు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటాడని, నలుపు, తెలుపు గీతలు కల్గిన చొక్కా, తెల్లని పంచె ధరించి ఉన్నాడని తెలిపారు. రెండురోజుల క్రితం మృతిచెంది ఉంటాడని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సెల్: 8712662178, ఎస్‌ఐ 8712662185, పోలీస్‌స్టేషన్ 8712662705 లకు సమాచారం ఇవ్వాలని తగిన ప్రోత్సాహక బహుమతి అందిస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

## ఫ్లైఓవర్ పిల్లర్ ఢీకొట్టి కారు బోల్తా

-వ్యక్తికి గాయాలు



పిల్లర్‌ను ఢీకొట్టి బోల్తాకొట్టిన కారు

**మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఒకారు అదుపుతప్పి ఫ్లైఓవర్ పిల్లర్ ఢీకొట్టి బోల్తాకొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని కాసింబావితండాకు చెందిన రమేష్ గురువారం సాయంత్రం తనకారులో మేడ్చల్‌నుండి వెళుతుండగా, అత్వెల్లి శివారులోగల రేకుల బావి వద్ద 44వ జాతీయ రహదారిలో అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు బోల్తాకొట్టగా అందులో ఉన్న రమేష్‌కు గాయాలయ్యాయి. అతనిని చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సహాయంతో పోలీసులు కారును అక్కడి నుండి పక్కకు తరలించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**జిల్లేడు చౌదరిగూడెం, అగస్టు, 29, ప్రభాతవార్త:**

జిల్లేడు చౌదరిగూడ మండలంలోని ఆయాగ్రామాలలో శుక్రవారం ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని జాకారం, వాచ్యతాండ, మల్కపహాడ్, గాలిగూడ తదితర గ్రామాలలో ఆయన పర్యటించి పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాలలో వార్డులు, బూత్‌ల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికలసమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, పంచాయతీకార్యదర్శులు పండరంగంగౌడ్, యాదయ్య, మాజి సర్పంచ్ యాదయ్య తదితరులు ఉన్నారు.

# దోమలు వదిలేసి..డీజిల్ మింగేసి

-జిహెచ్ఎంసి యాంటమాలజీలో ఆగని అవినీతి
-ఫాగింగ్ చేయకుండానే డీజిల్,పెట్రోల్ మాయం
-పెట్రోల్ బంకులతో సిబ్బంది కుమ్మక్కు..
-ఇంధనానికి బదులు నగదు వసూళ్లు




**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** నగర ప్రజలను దోమలు పట్టిపీడిస్తుంటే, వాటి నివారణకు కేటాయించిన కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగంలోని కొందరు అవినీతి అధికారులు దోచుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఫాగింగ్ చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టిస్తూ, డీజిల్, పెట్రోల్, మరమ్మతుల పేరుతో భారీగా బిల్లులు మాయం చేస్తున్నారు. ఈ అవినీతి బాగోతంపై ఏకంగా ఎంటమాలజీ సిబ్బందే ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో, బల్దియా విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పక్కాగా ఫాగింగ్ చేయాలన్న కమిషనర్ ఆదేశాలు గాలికొదిలేశారు. దీనిపై మల్కాజ్‌గిరి సర్కిల్‌కు చెందిన ఎంటమాలజీ వర్కర్లు ఇటీవల లెక్కలతో సహా ఫిర్యాదు చేశారు. తమ సర్కిల్‌లో రోజూ ఫాగింగ్ పేరుతో 120 లీటర్ల డీజిల్, 8 లీటర్ల పెట్రోల్‌ను అధికారులు కాజేస్తున్నారని, దీని ద్వారా ప్రతిరోజూ సుమారు రూ. 13,000 పక్కదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించి, లోతుగా ఆరా తీస్తున్నారు. విచారణలో భాగంగా, బక్రీద్ సెలవు దినమైన జులై 7న కూడా సిబ్బంది హాజరైనట్లు అటెండెన్స్ వేసి, ఆ రోజుకు సంబంధించిన డీజిల్, పెట్రోల్‌ను కూడా డ్రా చేసినట్లు గుర్తించినట్లు సమాచారం.ఈదందా కేవలం ఒక్క సర్కిల్‌కే పరిమితం కాలేదు. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**ఏళ్లుగా ఒకేచోట..**

ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన పలువురు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఏఈఈ అక్రమాలకు కేంద్ర బిందువులుగా మారారు. మరోవైపు, కీలకమైన శేరిలింగంపల్లి జోన్‌లో సీనియర్ ఎంటమాలజిస్ట్ లేకపోవడంతో, వర్కర్లు ఫీల్డ్‌కు రాగానే అటెండెన్స్ వేసి ఇళ్లకు పంపించేస్తున్నారని, ఫాగింగ్ పూర్తిగా అటకెక్కిందని తెలుస్తోంది. గ్రేటర్‌లోని 30 సర్కిళ్లకు గాను ఉన్న 300 చిన్న, 63 పెద్ద ఫాగింగ్ యంత్రాలలో, దాదాపు 50 యంత్రాలు ఎప్పుడూ మరమ్మతుల్లోనే ఉంటున్నాయి. అయితే, అధికారులు ఈ పాడైన యంత్రాల పేరుతో కూడా ఇంధనాన్ని డ్రా చేయడమే కాకుండా, వాటికి మరమ్మతులు చేయకుండానే చేసినట్లు బోగస్ బిల్లులు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నిధులను ఎంటమాలజీ ఎస్ఈలు, సూపర్‌వైజర్లు కుమ్మక్కై పంచుకుంటున్నారని, డీజిల్‌ను బయట అమ్ముకుంటున్నారని సొంత సిబ్బందే ఆరోపిస్తున్నారు.

**ఎన్నిమార్పులు చేసినా ఆగని అవినీతి..**

డీజిల్ దందాకు చెక్ పెట్టేందుకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ కూపన్లకు బదులుగా ఏటీఎం తరహా కార్డు విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఖైరతాబాద్ జోన్‌లో అమలులోకి తెచ్చారు. అయితే, అవినీతి అధికారులు ఇక్కడా తమ జిమిక్కు చూపిస్తున్నారు. పెట్రోల్ బంకులతో కుమ్మక్కై, ఇంధనానికి బదులుగా నగదు తీసుకుంటూ బిల్లులు పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జీహెచ్ఎంసీ ఏటా దోమల నివారణకు రూ.30 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా, ఆ నిధులు క్షేత్రస్థాయికి చేరకుండా పక్కదారి పడుతున్నాయి. దీంతో నగరవాసులు డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు.

# నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

-విద్యుత్తు ఆర్ఆర్ జోన్ సిజిఎం పాండియా నాయక్



**అత్తాపూర్ ఆగస్టు29,ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకొని నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్తు ఆర్ఆర్ జోన్ సిజిఎం పాండియా నాయక్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వరుడి నిమజ్జన చెరువులైన పత్తికొండను ఎస్ఈ శ్రీరామ్మోహన్, డి ఈ రత్నాకర్ రావు, భాస్కర్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సి ఈ పాండ్యా నాయక్ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనం సమయంలో మండపాల నిర్వాహకులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించినట్లయితే స్థానిక విద్యుత్ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ దుర్గాప్రసాద్, లైన్ మాన్ లో బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన

-లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం -రోడ్లపై ట్రాఫిక్ జామ్..వాహనదారులకు తిప్పలు





**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** నగరంలో గురువారం వర్షం దంచి కొట్టింది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, కొండాపూర్, లింగంపల్లి, కూకట్ పల్లి, ఎర్రగడ్డ, సనత్ నగర్, అమీర్ పేటర్,పంజాగుట్ట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మొహదీపట్నం అల్వాల్, బోయిన్ పల్లి, బాలానగర్ వంటి ప్రాంతాల్లో భారీగా కురిసింది..దీంతో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరింది. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోని సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, మల్లంపేట్, బౌరంపేట్, బహదూర్ పల్లి, సూరారం, చింతల్, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజులరామారంలో రాత్రి వరకు కురిసింది. ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ ప్రాంతాలలో ఉన్నట్లుండి ఊపందుకుంది. అదే విధంగా తార్నాక, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ ఏరియాల్లో కూడా వర్షం కురిసింది. సికింద్రాబాద్, పరేడ్ గ్రౌండ్స్ ఏరియాల్లో వర్షం కురుస్తుండటంతో ట్రాఫిక్ జాం అయ్యింది.

# నిమజ్జనానికి జిహెచ్ఎంసి పకడ్బందీ ఏర్పాట్లు

-134 స్టాటిక్ క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు సిద్ధం
-మూడు షిఫ్ట్ లలో 14,486 మంది విధులు
-రోడ్లపై 10,269 పైగా గుంతల పూడ్చివేత
-చెరువుల వద్ద డిఆర్ఎఫ్, ఈతగాళ్లతో పహారా



**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గణేశ్ నిమజ్జనాన్ని సజావుగా,సురక్షితంగా నిర్వహించేందుకు వీలుగా జీహెచ్ఎంసీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, రెవెన్యూ, విద్యుత్, ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేస్తూ, నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా జరిగేలా పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేసింది. గణేష్ నిమజ్జనం ఆధ్యాత్మిక వాతావరణంలో సాఫీగా జరిగేలా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పర్యవేక్షణ చేస్తున్నారు.అలాగే ప్రధాన చెరువులతో పాటు 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనంజరిగేలా జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గనుంది. అలాగే డీఆర్ఎఫ్ బృందాలు,ఈతగాళ్లతో పహరా ఉండనున్నారు.నిమజ్జనం వేగంగా, సురక్షితంగా, సాఫీగా జరిగేలా 134 స్టాటిక్ క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ,హైడ్రా సమన్వయంతో హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యేకంగా 9 పడవలు, 16 డీఆర్ఎఫ్ బృందాలు, 200 ఈతగాళ్లను జీహెచ్ఎంసీ అందుబాటులో ఉంచుతుంది. 839. 42 కి.మీ. ఊరేగింపు మార్గాల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, వేలాడే వైర్ల తొలగింపు పనులు పూర్తయ్యాయి.అలాగే14,486 శానిటేషన్ సిబ్బంది, 160 గణేశ్ యాక్షన్ టీమ్‌లు మూడు షిఫ్ట్ లలో నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తారు.గణేష్ మండపాల వద్ద వ్యర్థాల సేకరణకు 5 లక్షల ట్రాష్ బ్యాగులు పంపిణీ చేశారు. అదనంగా 2,000 స్వీపర్లు, 102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలు, 30 స్వీపింగ్ మెషిన్లు నిమజ్జన దినాన చెత్త తొలగింపులో పాల్గొంటాయి.అలాగేప్రజల కోసం 309 మొబైల్ టాయిలెట్స్, 56,187 లైటింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్య భద్రత కోసం 7 మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ లతో మూడు షిఫ్ట్‌లలో పని చేస్తున్నారు.అలాగే దోమల నివారణకు ఆంటి లార్వా, ఫాగింగ్ చేపట్టారు. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా చూసేందుకు వీధి కుక్కలను పట్టుకొనే వాహనాలను మండపాలు, నిమజ్జన పాయింట్‌లలో సిద్ధంగా అందుబాటులో ఉంచుతున్నారు.అలాగే రోడ్డు సేఫ్టీ డ్రైవ్ లో భాగంగా ఊరేగింపు జరిగే మార్గాల తో పాటు నగరంలో 10,269 గుంతలను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం పూడ్చివేసింది. రోడ్డు మరమ్మతులు కూడా పూర్తి చేసింది.

గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా గణేశ్ నిమజ్జనం ఎటువంటి అవాంఛ నీయ ఘటనలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు.

# ఉధృతంగా పారుతున్న మూసీ నది

- మూసీలో మునిగిన నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్
- నిలిచిపోయిన నార్సింగి-మంచిరేవుల రాకపోకలు



నార్సింగి వద్ద ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ రోడ్డుపై ఉధృతంగా పారుతున్న మూసీ నది దృశ్యం




మంచిరేవుల వద్ద బ్రిడ్జి పైనుంచి పారుతున్న మూసీ నది.

**నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్‌లు నిండు కుండలుగా మారాయి. దీంతో జల మండలి అధికారులు ఈ రెండు జలాశయాల నుంచి నీటిని ఈసీ, మూసీ నదుల్లోకి వదిలిపెట్టారు. గండిపేట జలాశయం వద్ద 8.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి మూసీ నదిలో కి 2,700. క్యూసెక్కుల నీటిని వదిలేశారు. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం వద్ద 2.గేట్లను 3.ఫీట్లు, 1.గేటును 1.ఫీటు మేర ఎత్తి ఈసీ నదిలోకి 2,300.క్యూసెక్కుల నీటిని వదలిపెట్టారు. దీంతో ఈసీ నది లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద మూసీలో కలిసి మరింత ఉధృతంగా పారుతుంది. గండిపేట జలాశయం నుంచి వస్తున్న వరద నీరు నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఎగ్జిట్‌ను పూర్తిగా ముంచెత్తింది. దీంతో అధికారులు ఇక్కడ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే నార్సింగి-మంచిరేవుల మధ్య ఉన్న బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్తుండడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడికి ప్రజలు ఎవ్వరూ రాకుండా పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేసుకొని బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఎప్పటికప్పుడు జలమండలి, గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది : మంత్రి వివేక్ వెంకటస్వామి



హెచ్ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం గ్రేవ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలంటూ ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేస్తున్న మైనారిటీ నాయకులు.

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 29, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సంక్షేమం కోసం అన్నివేలల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని నియోజకవర్గం ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్ నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో నూతనంగా మైనారిటీల కోసం స్మశాన వాటిక ఏర్పాటు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన మజీద్ కమిటీలు స్మశాన వాటికల కమిటీలు శుక్రవారం నమాజ్ తర్వాత పెద్ద ఎత్తున సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం జనాభ పెరగటంతో మైనార్టీలకు స్మశాన వాటిక స్థలం సరిపోవటం లేదని కొత్త స్థలం కేటాయించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన వవెంటనే స్పందించి నియోజకవర్గంలో ఉప ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సమస్యను పరిష్కరిస్తామని ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జిల్లా కలెక్టర్‌తో చర్చించడం జరిగిందని తొందర్లో స్థలాన్ని పరిశీలించి కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మైనారిటీ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మైనారిటీల మద్దతు ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే హజారుద్దీన్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రెడ్డి రామ్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నిజాముద్దీన్, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అమలు




రూట్ మ్యాప్

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నగరంలో గణేష్ ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. చవితి ప్రారంభమైన మూడవ రోజు నుంచి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్‌డెవిస్ వెల్లడించారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని.. రద్దీని బట్టి ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**


కర్బలా మైదాన్ నుంచి వచ్చే ట్రాఫిక్ అప్పర్ ట్యాంక్ బండ్ వైపు అనుమతించరు. లిబర్టీ, ఖైరతాబాద్ వైపు వెళ్లాలనుకునేవారు కవాడిగూడ క్రాస్‌రోడ్డు, డీబీఆర్ మిల్స్, వార్త లేన్, బండమైసమ్మ, ధర్నాచౌక్, ఇందిరాపార్క్ ఎక్స్ రోడ్, రామకృష్ణ మఠం, కట్టమైసమ్మ జంక్షన్, అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఇక్బాల్ మినార్ వైపు వెళ్లవచ్చు. ట్యాంక్‌బండ్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లాలనుకునేవారు రాణిగంజ్, మినిస్టర్ రోడ్, బేగంపేట్‌ల నుంచి వెళ్లవచ్చు. పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వైపు వెళ్లే సాధారణ ట్రాఫిక్‌ను నిరంకారి, పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్, ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. అంబేద్కర్ విగ్రహం నుంచి వచ్చే ట్రాఫిక్ ఎన్టీఆర్ మార్గ్ వైపు అనుమతించరు. ఇక్బాల్ మినార్ వైపు వెళ్లాలి. ఇక్బాల్ మినార్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ట్యాంక్‌బండ్ వైపు అనుమతించరు.

**తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు మళ్లిస్తారు.**

బుద్ధభవన్ నుంచి వచ్చే సాధారణ ట్రాఫిక్‌ను నెక్లెస్ రోడ్డు వైపు అనుమతించరు. అత్యవసర నిమిత్తం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కి కాల్ చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే వాహనదారులు సైతం పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్‌డెవిస్ పేర్కొన్నారు.

# గణేష్ నిమజ్జనం సందర్బంగా గట్టి బందోబస్తు

: నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్

**చార్మినార్,ఆగష్టు 29 ప్రభాతవార్త :** పాతబస్తీ పురానీహవేలిలో శుక్రవారం డిజీ, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అధ్యక్షతన దక్షిణ మండలం పోలీస్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీ గణేష్ నిమజ్జనం సందర్భంగా తీసుకోవలసిన భద్రతా చర్యలు,బందోబస్తుపై పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పోలీస్ అధికారులతో కలిసి చర్చించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ శ్రీ గణేష్ నిమ జ్జనం,మిలాద్ ఉన్ నబీ పండుగ కూడ ఉన్నందున శాంతి భద్రతల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించామని తెలిపారు.గణేష్ విగ్రహాలను నిమజ్జనం రోజున త్వరగా తరలించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించామని,అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని ఆయన ఆయన తెలియజేశారు.ఈ సమా వేశంలో సౌత్ జోన్ డిసిపి స్నేహా మెహ్రా,డిసిపి ఎస్‌బి అపూర్వరావు,ట్రాఫిక్ డిసిపి వెంకటేశ్వర్లుతో పాటు పాతబస్తీలోని మీర్‌చౌక్, చార్మినార్,ఫలక్‌నుమా ఏసిపిలు,సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ల పదవీవిరమణ వయసు 65కు పెంచొద్దు

-ఏజీ వర్సిటీ విద్యార్థుల ఆందోళన



**అత్తాపూర్ ఆగస్టు29,ప్రభాతవార్త :** 65 వద్దు...60 ముద్దు ,పాలిటిక్స్ వద్దు పాఠశాలు ముద్దు,రీసెర్చ్ మీద దృష్టి పెట్టు..నూతన వంగడాలను కనిపెట్టు విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందించురైతులకు వ్యవసాయ విస్తరణ సేవలు అందించుఅంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వ్యవసాయ వర్సిటీలోనీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును ఎట్టి పరిస్థితిలో పెంచొద్దంటూ విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో గల జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... వర్సిటీలో మాకు పాఠాలు చెప్పాల్సిన ప్రొఫెసర్లు పాలిటిక్స్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించడం హాస్యాస్పదమన్నారు. కొంతమంది ప్రొఫెసర్లు టాసా అనే పేరు మీద ప్రతిరోజు యూనివర్సిటీ అధికారులను కలుస్తూ వర్సిటీ పరిపాలన సక్రమంగా జరగకుండా అడ్డుపడడం బాధాకరణమన్నారు.ప్రొఫెసర్లు తమ పర్సనల్ ఎజెండా కోసం వర్సిటీ అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలలో పనిచేసే ప్రొఫెసర్ల పదవి విరమణ 60 నిండి 65లకు పెంపు అనేది కేవలం ట్రెడిషనల్ యూనివర్సిటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేస్తూ జీవో విడుదల చేసిందని అందులోనే టెక్నికల్ వర్సిటీలైనా అగ్రికల్చరల్, హార్టికల్చర్ వెటర్నరీ యూనివర్సిటి లకు వర్తించదనీ స్పష్టం చేసిన కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇటు వర్సిటీని అటూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ దొడ్డిదారిలో పదవి విరమణ వయసు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు వర్సిటీ వీసీ జానయ్య రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం చేపట్టగా ఆది సక్సెస్ కావడంలో వర్సిటీ శాస్త్రవేత్తలతో పాటు విద్యార్థుల పాత్ర కూడా ఉందని మమ్మల్ని అభినందిస్తూ మా సేవలను గుర్తిస్తూ గత 14 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్టైఫండ్‌ను పెంచుతూ వర్సిటీ తీసుకున్న నిర్ణయం ప్రొఫెసర్లకు నచ్చకపోవడం చాలా బాధాకరమన్నారు.ఇప్పటికైనా టాసా అనే పేరు మీద వర్సిటీలో రాజకీయాలు చేస్తే వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందంటూ విద్యార్థులు హెచ్చరించారు. పదవి విరమణ వయసు పెంపు విషయంలో వారి పంతాను మార్చుకోని పక్షంలో అగ్రికల్చరల్, హార్టికల్చర్ వెటర్నరీ మూడు వర్సిటీల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సిద్ధమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజ్ కుమార్, కవి రాజు, శంకర్ నాయక్, లోకేష్, శ్రావణి ,నవ్య, ప్రసాద్, మునీర్, భాను తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత్ కాలనీలో ఘనంగా వినాయకుడికి పూజలు



**అత్తాపూర్ ఆగస్టు29, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్లోని ప్రశాంత్ కాలనీలో పొదుపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి పూజ కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం ఎంతో ఘనంగా జరిగాయి. వేద పండితుడు మంత్రోచ్ఛరణలను మధ్య జరిగిన నాయకుడు పూజలో పొదుపు సంఘం సభ్యులు ఆర్.కమలేష్ కుమార్, ఎన్.శేఖర్, డి, ఆంజనేయులు, గణేష్, సిద్ధం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పి. వెంకటేష్, రమాకాంత్, రవీందర్ రెడ్డి, మల్లేష్, నరసింహ, కారుకొండ శ్రీనివాస్, నరసింహ కాలనీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదలను స్వీకరించారు.

## గణనాథుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

**-ఓగ్లాపూర్ మాజీ సర్పంచు రాములు**



గణేష్‌నిమజ్జనానికి శ్రీశైలండ్యామ్‌కు బయలుదేరిన అఖిలపక్షంనాయకులు

**కోట్‌పల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
ఆగణనాథుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఓగ్లాపూర్ మాజీ సర్పంచ్ రాములు అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద అఖిలపక్షం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి మూడురోజుల పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం లడ్డు వేలంలో ఓగ్లాపూర్ మాజీసర్పంచ్ రాములు రూ.15వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. గణేష్ నిమజ్జనం చేసేందుకు శ్రీశైలం డ్యామ్‌కు కోట్‌పల్లి నుంచి బయలుదేరారు. ఈకార్యక్రమంలో మండల అఖిలపక్ష నాయకులు మాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, శశికాంత్, ప్రేమ్‌కుమార్, వెంకటయ్య, లక్ష్మణ్, ఈశ్వర్, మహేష్‌కుమార్, చిన్న సందీప్‌లు పాల్గొన్నారు.

## నేడు రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం

**-ఎంపిడిఓ డ్యానియెల్**

**కోట్‌పల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసి) సిద్ధమవుతుంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో, గ్రామ పంచాయతీల పరిధిలో ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా వెల్లడికి సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈనెల 28న గ్రామ పంచాయతీలలో, మండల పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ప్రదర్శించడం జరిగిందని ఎంపిడిఓ డ్యానియెల్ తెలిపారు. 30న శనివారంఉదయం పదకొండుగంటలకు కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసమావేశానికి అన్నిపార్టీల నాయకులు తప్పకుండా హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

## కేంద్రం బాధ్యతారాహిత్యంతోనే యూరియా కొరత

**-మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతనర్సింహ్మ**



విలేకరులతోమాట్లాడుతున్న మార్కెట్‌కమిటీచైర్మన్ యాట గీతనర్సింహ్మ

**ఆమనగల్లు, జూలై 19, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన యూరియా కొరతకు కేంద్రప్రభుత్వ బాధ్యతారాహిత్యమే కారణమని ఆమనగల్లు మార్కెట్‌కమిటీచైర్మన్ యాట గీతనర్సింహ్మ అన్నారు. రాష్ట్రానికి యూరియా అవసరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వానికి నివేదికలను అందజేసినా అందుకు సరిపడా సరఫరా చేయకపోవడమే నేడు యూరియా కొరతకు కారణమైందని ఘాటుగా విమర్శించారు. యూరియా కొరతకు కేంద్రప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని ఆమె డిమాండ్‌చేశారు. ఆమనగల్లుపట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో పాలకమండలిసభ్యుల తోపాటు అధికారపార్టీ నేతలతో కలిసి చైర్మన్ గీత శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్‌కు 9.8లక్షల మెట్రిక్‌టన్నుల అవసరాలను రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి నివేదించిందన్నారు. అయితే కేవలం 5.72లక్షల మెట్రిక్‌టన్నులు మాత్రమే సరఫరాచేసిందన్నారు. ఆగస్టునాటికి 8.3లక్షల మెట్రిక్‌టన్నులు అవసరాలుండగా సరఫరా కొరతగానే మిగిలిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై యూరియా కొరతను రాజకీయాలకు వాడుకుంటున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, మండలపార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పెరుమాండ్ల కృష్ణ, నాయకులు దావ ధనంజయ్య, గుర్రం కేశవులు, వస్పుల శ్రీకాంత్, ఎంగలి ప్రసాద్, దుడ్డు కృష్ణ, ఫరీద్, కాలె మల్లయ్య, అలీమ్, శ్రీనునాయక్, కొప్పు విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సోమన్‌గుర్తిలో ఘనంగా ఋషిపంచమి

**పూడూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
పూడూరు మండలం పరిధిలోని సోమన్‌గుర్తి గ్రామంలో శుక్రవారం ఋషిపంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వినాయకచవితి తరువాతరోజు ఋషిపంచమి సందర్భంగా ప్రతిసంవత్సరం భక్తులు ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పుట్టవద్ద మట్టితో ఋషులను, నాగభైరవ విగ్రహాలను తయారుచేసి గతరెండురోజులుగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పూజావేడుకల్లో పాల్గొన్న భక్తులకు రఘురాంరెడ్డి కుటుంబ సభ్యులు ఇంటివద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.రఘురాంరెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రవీందర్, జంగయ్య, రాంచెంద్రయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 7న వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సదస్సు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

**మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
సెప్టెంబర్ 7న మేడ్చల్‌లో జరిగే వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ తిప్పరపు లక్ష్మణ్‌మాదిగ పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇచ్చినమాటప్రకారం తక్షణమే పెన్షన్లు పెంచాలని డిమాండ్‌చేశారు. వికలాంగుల పెన్షన్ రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతోపాటు అన్నిరకాల చేయూత పెన్షన్లు రూ.4వేలకు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7వ తేదీన మేడ్చల్ టౌన్‌లో చేయూత పెన్షన్‌దారుల సన్నాహక మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పాల్గొంటారని పేర్కొన్నారు. 50లక్షలమంది పెన్షన్‌దారులపక్షాన మంద కృష్ణమాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అందులోభాగంగా తెలంగాణ నలుమూలల తిరుగుతూ సెప్టెంబర్ 7న మేడ్చల్‌కు వస్తున్నారని తెలిపారు. సమావేశంలో దండోరా జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్‌వై అశోక్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశపాగా రాంచందర్‌మాదిగ, జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్‌మాదిగ, కోఇంచార్జ్ ముంద్రాతి అరుణ్ మాదిగ, మండల ఇంచార్జ్ దబిల్పురం పరుశురాంమాదిగ, జీడిపల్లి శివ మాదిగ, రామకృష్ణ, ఎర్రోళ్ల బాలనర్సింహా, బాలయ్య, సిల్వేరు శ్రీనివాస్, రసమళ్ల యాదగిరి, బిక్షపతి, శంకర్, సాయిలు, కుమార్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# బోనస్ డబ్బులు రైతులకు అందేనా?

**-బోనస్ కోసం ఎదురుచూపులు**
**-సన్నరకం వడ్లు పండించిన రైతులకు బోనస్‌పైనే ఆశ**

**ధారూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లు ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, కొనుగోలు పూర్తయి రెండు, మూడు నెలలు గడిచినా రైతులకు బోనస్ డబ్బులు ఇంకా అందలేదు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు బోనస్ అందుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. సన్నవడ్ల ధాన్యం కొనుగోలు పూర్తయినప్పటికీ, రూ.500 బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేవు. బోనస్ కోసం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవద్ద ధాన్యం విక్రయించినా, ప్రభుత్వం నుంచి డబ్బులు అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ధారూర్ మండల పరిధిలోని నాగారంలో గ్రామంలో ధారూర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో సన్న రకం వడ్లు కొనుగోలు కేంద్రం నిర్వహించి 119 మంది రైతుల నుంచి 8,480 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని సేకరించారు. అలాగే హరిదాసు పల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో గట్టేపల్లి గ్రామంలో నిర్వహించిన సన్నరకం కొనుగోలుకేంద్రంలో 1118 సంచులు (447.2 క్వింటాల్) ధాన్యాన్ని సేకరించారు. కానీ ఇప్పటివరకు రైతులకు బోనస్ డబ్బులు పడలేదు. రోజూ బ్యాంకుకువెళ్లి బ్యాలెన్స్ చూసుకుంటున్నామని, బోనస్ డబ్బులు రూపాయి పడలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మద్దతుధరకు పెట్టుబడి ఖర్చులు పోయినా.. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తే రెక్కలకష్టమైనా మిగులుతుందని ఆశించామని అంటున్నారు. అందుకోసమే కాయకష్టం చేసి సన్నవడ్లు పండించామని, కష్టమైనా తీసుకెళ్లి కొనుగోలుకేంద్రాల్లోనే విక్రయించామని అన్నారు.



ఫోటోనెం:29డీఆర్ఆర్‌పీ4: విక్రయించిన పత్రాలను చూపుతున్న రైతులు

**ప్రభుత్వంపై నమ్మకంతో సాగుచేశా...**
**డాకముల వెంకటయ్యగౌడ్, నాగారం రైతు**
యాసంగి సీజన్‌లో ఐదు ఎకరాల్లో సన్న వడ్లు వేశాను. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో లబ్ధి జరుగుతుందనే ఉద్దేశంతో సన్నాలవైపు మొగ్గు చూపాను. కొనుగోలు కేంద్రంలో జూన్‌లో 77.28 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం విక్రయించా ను. రూ. 38వేల బోనస్ రావాల్సి ఉంది. రెండు నెలలుగా ఎదురుచూసున్నా ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా బోనస్ డబ్బులు చెల్లించాలి.

**ధాన్యం విక్రయించి రెండు నెలలు అయినా బోనస్ అందలేదు...**
**పరిగి శ్రీనివాస్, రైతు, నాగారం**
ధాన్యం విక్రయించి రెండునెలలైనా బోనస్‌డబ్బులు ఇప్పటివరకు అందలేదు. నాగారం కొ నుగోలు కేంద్రంలో 80క్వింటాళ్ల సన్నరకం వడ్లు విక్రయించాను. దిగుబడి రాక నష్టపోయాను. దానికితోడు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ డబ్బులు ధాన్యం అమ్మి రెండునెలల గడుస్తున్నా నాఖాతాలో జమ చేయలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే బోనస్ డబ్బులు అందించి సన్నవడ్లు పండించిన రైతులను ఆదుకోవాలి.

## రోడ్డుపై గుంత..

**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు**



అంపల్లి నుంచి ధారూర్ వెళ్ళు రోడ్డు మధ్యలో పడిన గుంత

**ధారూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. అయితే ధారూర్ మండల పరిధిలోని అంపల్లి నుంచి ధారూర్ వెళ్ళు రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం వందలాది వాహన రాకపోకలతో ఎప్పుడూ రద్దీగా ఉండే రోడ్డుపై గుంత పడింది. ఆ గుంతతో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళలో ప్రయాణం చేయడం వల్ల గుంత గమనించకుండా వెళ్తే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులకు స్కూలుకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని, ప నుల నిమిత్తం మండల కేంద్రానికి సైతం వెళ్లలేకపోతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామస్థులు ఈ సమస్య గురించి పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

**-ఎస్ఐ వేణుకుమార్**

**పెద్దేముల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పెద్దేముల్ ఎస్ఐ వేణుకుమార్ అన్నారు. జిల్లా ఎస్పి నారాయన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పెద్దేముల్ మండలం ఓంలానాయక్ తాండాలో వికారాబాద్ జిల్లా పోలీస్ కళాబృందంచే వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ వేణుకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి, కొకైన్, మత్తుపదార్థాలు నిషేధించడమైనదని అన్నారు. రోడ్డు భద్రతానియమాలు పాటించాలని, మద్యంసేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో కరెంటుస్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టరాదని అన్నారు. కాలువలు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రవాహం తగ్గిన తరువాత వెళ్ళాలని సూచించారు. అత్యసవర సమయంలో 100కు కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యం.అశోక్ వికారాబాద్ జిల్లా పోలీస్ కళాబృందం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**-ఎఎంసి వైస్‌చైర్మన్ ఎస్.నారాయన్‌రెడ్డి**

**పెద్దేముల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోటపల్లి మార్కెట్ కమిటి వైస్‌చైర్మన్ ఎస్.నారాయన్‌రెడ్డి ఆకాంక్షించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని యాదవ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆయన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ సకల విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడని అందుకు మొట్టమొదటగా ఆయనకు పూజలు నిర్వహిస్తారని అన్నారు. ముల్లోకాలు ఎక్కడో లేవని, తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే ముల్లోకాలు తిరిగినట్టేనని నిరూపించిన గణనాథుడు దేవదేవుడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌గౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, తలారి రాములు, చెవుల శ్రీనివాస్, కమ్మరి శ్రీనివాస్, కుర్వ రాజు, కుర్వ శేఖర్, కుర్వ మల్లేష్, శ్రీశైలం, మంగలి రాములు, టిల్లు, వినయ్, గొబ్బురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టాయిలెట్ రూములకు శంకుస్థాపన



టాయిలెట్ రూమ్‌లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

**కేశంపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
కేశంపేట మండలపరిధిలోని నిర్దావెల్లిగ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్‌రూములు లేవని పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కోరగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తన సొంతనిధులతో టాయిలెట్ రూముల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా స్థానిక మండలనాయకులు, పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో టాయిలెట్ రూముల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, గ్రామస్థులు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి కృతజ్ఞత తెలుపుతూ సంతోషం వ్యక్తంచేశారు. తమ సమస్యల పట్ల సత్వరమే స్పందించి పాఠశాలలో టాయిలెట్ల ఏర్పాటుకు సౌకర్యాలను ఏర్పాటుచేయడం పట్ల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ వైస్ ఎంపిపి సురేందర్, నిర్దావెల్లి మాజీ సర్పంచ్‌లు బడుక వెంకటయ్య, జంగయ్య, పాపిరెడ్డిగూడ మాజీసర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, కాకునూర్ మాజీసర్పంచ్ యారం చంద్రకళ శేఖర్ రెడ్డి, పోమాల్‌పల్లి మాజీసర్పంచ్ భూపాల్‌రెడ్డి, తొమ్మిదిరేకుల మాజీసర్పంచ్ బాలరాజ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ పల్లాటి కృష్ణయ్య, నాయకులు నాగిళ్ల వెంకట్, మాజీ విద్యాకమిటీ అధ్యక్షులు నాగరాజు, కొత్తపేట జగన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ అనిత, బిఆర్ఎస్‌పార్టీ నిర్దావెల్లి అధ్యక్షులు ఉమాపతి, మాజీ వార్డ్‌మెంబర్లు బండ నిరంజన్, ఫైజాన్‌ఖాన్, సత్యనారాయణ, శ్రీనివాస్, పద్మ, జి.విక్యానాయక్, రమేష్‌నాయక్, చందునాయక్, బిఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, బద్రినాయక్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలి

**-పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి**



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, రైతులు

**పరిగి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని రైతులకు సరిపడా యూరియా అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టుగా ఉండటం భావ్యం కాదని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. శుక్రవారం పరిగి పట్టణంలోని ఆగ్రోస్ రైతుసేవాకేంద్రం వద్ద సరిపడా యూరియా అందించట్లేదని, రైతుసేవాకేంద్రం మూసివేసి రైతులు రోడ్డుపై ధర్నాకుదిగారు. రైతుల ధర్నాకు మద్దతుగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ధర్నాలోపాల్గొని రైతులకు సంఘీభావంతెలిపారు. ధర్నాకు మద్దతుతెలిపిన బిఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు స్వల్పవాగ్వివాదం చోటుచేసుకుంది.. ధర్నాలో రైతులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కేశంపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
కేశంపేట మండల కేంద్రంలోని టిఎస్‌వై గార్డెన్లో ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నా గెలుపుకోసం అహర్నిశలు కష్టపడి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. నేను గెలిచా ఇప్పుడు మిమ్మల్ని గెలిపించే బాధ్యత నేను తీసుకుంటున్నా అని అన్నారు. మనలో ఎవరికైనా ఏవైనా విభేదాలు ఉంటే వాటిని పక్కన పెట్టి అందరం కలిసికట్టుగా మన కాంగ్రెస్ పార్టీ విజయానికై కృషి చేద్దాం అని కార్యకర్తలకు తెలిపారు. ఎన్నికల సమయంలో లేనిపోని రాజకీయాలకు బలికావద్దని పార్టీ సూచించిన వ్యక్తులను శక్తులుగా మలిచి గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉందని గుర్తు చేశారు. గ్రామాల్లో ఇకపై స్థానిక సంస్థల కోసం ఎలా పనిచేయాలో పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, జగదీశ్వరప్ప, మహిళా బిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయముదిరాజ్, సురేష్‌రెడ్డి, తైద పర్వతాలు, కోడూరు రాములు, ఎగిరే నాగేష్, కోడూరు నర్సింలు, తాళ్ల నర్సింలుగౌడ్, రావుల పెంటయ్యముదిరాజ్, గ్యార సురేష్, హరీశ్వర్‌రెడ్డి, ఎండి ఆమేర్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## తగినంత యూరియా సరఫరా చేయాలి

**-మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**



బిఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**ధారూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
రైతులకు సరిపడ తగినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ధారూర్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట, తాండూర్ హైదరాబాద్ ప్రధానరహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని, పిఎసిఎస్ ఎదుట ఉదయంనుంచి లైన్‌లో నిలిచిన రైతుల ను పరామర్శిం చారు. ఈనిరసనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రంగంలోకిదిగాక నిరసన విరమించారు. ఈ కార్య క్రమంలో మండల సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, హినయత్ ఉల్లఖాన్, రాములు, అంజయ్య, దేవేందర్‌నాయక్, బాలునాయక్, జైపాల్‌రెడ్డి, చంద్రమౌళి, యాత్రగౌడ్, స్టేషన్‌రాములు, మహేష్, హఫీజ్ ఖురేషి, రవినాయక్, వెంకట్రాంరెడ్డి, మహేష్, చిన్నయ్యగౌడ్, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఘట్‌కేసర్ రెడ్డిసంఘం ఎన్నికలు

**-అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ**

**ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ రెడ్డిసంక్షేమసంఘం అధ్యక్షపదవికి ఇద్దరు పోటీపడుతున్నారు. ఈనెల 31న జరుగనున్న రెడ్డిసంఘం సాధారణ ఎన్నికల్లో 344మంది సభ్యులు ఓటువేయనున్నారు. అధ్యక్షపదవికి రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల వెంకట్‌రెడ్డి, కందకట్ల మాధవరెడ్డి, మారం లక్ష్మారెడ్డిలు నామినేషన్లు వేయగా వీరిలో రేసు లక్ష్మారెడ్డి, మారం లక్ష్మారెడ్డిలు తమ నామినేషన్లను ఉపసంహారించుకున్నారు. దీంతో కందకట్ల మాధవరెడ్డి, చందుపట్ల వెంకట్‌రెడ్డిలు అధ్యక్షపదవికి పోటీలోనిలిచారు. రెండు ఉపాధ్యక్ష పదవులకు పలుగుల శ్రీకాంత్‌రెడ్డి, సుడి శ్రీకాంత్‌రెడ్డిలు నామినేషన్లు వేయగా పోటీలేకపోవడంతో ఏకగ్రీవం అయ్యారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డిలు నామినేషన్ వేయగా వెంకట్‌రెడ్డి తర్వాత నామినేషన్‌ను ఉపసంహరించుకోగా కొమ్మిడి శివప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవం అయ్యారు. సంయుక్త కార్యదర్శి స్థానానికి కంభం లక్ష్మారెడ్డిలు నామిషనేషన్లువేయగా పోటీలేకపోవడంతో ఆయన ఏకగ్రీవం అయ్యారు. కార్యవర్గసభ్యులుగా బీరెడ్డి రవీందర్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంకాగా కోశాధికారి పదవితో పాటు మరోనాలుగు కార్యవర్గసభ్యుల స్థానాలకు ఎవరుకూడా నామినేషన్లు వేయకపోవడంతో ఖాళీగా ఉన్నాయని ఎన్నికల అధికారి కొమ్మిడి రాఘవరెడ్డి తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

**-మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్**



నిర్మాణ పనులను ప్రారంభించిన ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్

**శామీర్‌పేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉద్దెమర్రి శ్రీవిష్ణు శివాలయంకు రాజగోపురం, పుష్కరఘాట్ నిర్మాణ పనులకు ప్రభుత్వం 50లక్షల రూపాయలు మంజూరు చేసిందని నిర్మాణ పనులను ప్రారంభించామని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు,శివాలయం (అక్కన్న,మాదన్నల ఆలయం) వద్ద రాజగోపురం, పుష్కరఘాట్‌ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా శ్రీవేంకటేశ్వరస్వామిని, శివుడిని ఆయనతో పాటు పలువురునాయకులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంసిపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, ఆలయచైర్మన్ బి.నిర్మలవెంకటగిరి ప్రసాద్, మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు దోసకాయల వెంకటేశ, జగన్నాథం, లక్ష్మారెడ్డి, యాదగిరి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, భస్వారెడ్డి, నల్ల ప్రభాకర్‌రెడినడ, జె.నర్సింలు, మల్లేశ్, కీసరి నర్సింలు, దుర్గం ప్రవీణ్, దేవాలయ అసిస్టెంట్ ఇంజనీర్ స్తపతి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి సిపి ఏర్పాట్ల పరిశీలన

**-ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ సందర్శన**



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సిపి సుధీర్‌బాబు

**ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతాచర్యలు తీసుకోవాలని రాచకొండ సిపి జి.సుధీర్‌బాబు అధికారులకు సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని లక్ష్మినారాయణచెరువు (మినిట్యాంక్‌బండ్) వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు పరిశీలించారు. శుక్రవారం నుంచి చెరువులో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రారంభంకాగా అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. చెరువుకట్టపై క్రేను, సిసికెమెరాలు, కర్రలతో ఏర్పాటు చేసిన బారికేడ్లు, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి క్రేన్లు, బారికేడ్లు, విద్యుత్‌శాఖ నుంచి లైటింగ్, మున్సిపల్ ద్వారా పారిశుధ్యపనులు, పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. ఈసందర్భంగా సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ రాచకొండపరిధిలో గణేశ్‌నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సజావుగా సాగేలా అన్నిరకాల చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రతాచర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. సిపివెంట యాదాద్రి భువనగిరి అక్షాంశ్ యాదవ్, భువనగిరి ఎసిపి రాహుల్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ సిపి శ్రీనివాస్, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, మునిపల్ కమిషనర్ పంజాల రాజేశ్‌గౌడ్, ఎస్ఐ శేఖర్, కీసరగుట్ట డైరక్టర్ సామల అమరేందర్, సహకారసంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ సిపి సుధీర్‌బాబు సందర్శించారు. పిఎస్‌లో రికార్డులు, కేసుల ప్రగతి, సిబ్బంది పనితీరుపై ఆయన ఇన్‌స్పెక్టర్ బాలస్వామిని ఆరాతీశారు. ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు ఏర్పరచుకొని మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. శాంతిభద్రతల విధినిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదని నిర్దేశిత సమయంలో కేసు దర్యాప్తులను పూర్తి చేయాలని సిపి సుధీర్‌బాబు అన్నారు.